సాక్షి
హనుమకొండ
బుధవారం 23 అక్టోబర్ 2024



కేయూలో విద్యార్థులకు హాస్టల్ వసతి

కాకతీయ యూనివర్సిటీ వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు హాస్టళ్లలో వసతి కల్పించనున్నారు. - 8లో▸



రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ప్రారంభం

వరంగల్ జిల్లా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^{0}/19^{0}$

వాతావరణం

ఉదయం నుంచి పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

శిక్షణ వేదికల మార్పు

విద్యారణ్యపురి : జిల్లాలో కొత్తగా నియామకం అయిన, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు నేటినుంచి శిక్షణ ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ముందు ప్రకటించినట్లుగా కాకుండా శిక్షణ వేదికలను మార్చినట్లు హనుమకొండ డీఈఓ వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీ(నేడు) హిందీ సబ్జెక్టు టీచర్లకు హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో, గణిత ఉపాధ్యాయులకు లష్కర్‌బజార్ ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో శిక్షణ ఉంటుందని వెల్లడించారు. అలాగే ఈనెల 24న జీవ శాస్త్ర ఉపాధ్యాయులకు ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో, ఫిజిక్స్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, ఈనెల 25న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో శిక్షణ నిర్వహిస్తామన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో విద్యార్థినుల ఎంపిక



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 10 మంది విద్యార్థినులు ప్రాంగణ నియామకాల్లో ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని ట్రాక్ 3డి.ఏఐఈ సంస్థలో నియమాకాలు పొందినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు మంగళవారం తెలిపారు. వీరికి వార్షిక వేతనం ఒక్కొక్కరికి రూ.7లక్షలు ఉంటుందన్నారు. ప్రాంగణ నియామకాలు పొందిన వారిలో అక్షిత, ఉదారి చిన్నారి, ఎస్.శృతి, మౌనికా రెడ్డి, వేల్పుల జాహ్నవి, పసునుటి లక్ష్మి, ఎం.చందన, కందుల మేఘన, భూక్య మైబు, జన్ను సౌమ్య ఉన్నారని తెలిపారు. వీరిని మంగళవారం క్యాంపస్‌లో కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అభినందించారు.

ప్రీ రిపబ్లిక్ డే క్యాంపునకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కేయూ క్యాంపస్ : ప్రీ రిపబ్లిక్ డే ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపునకు కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవాపథకం వలంటీర్లు ఎంపికైనట్లు కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ మంగళవారం తెలిపారు. వచ్చే నెల 12వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మహారాష్ట్రలోని లోజల్గాంలో ప్రీ రిపబ్లిక్ డే జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) క్యాంపు జరగనుంది. ఎంపికైన వారిలో జి.వెంకన్న (యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల), కోనేటి నాగరాజు (నేలకొండపల్లి, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ), టి.రామచరణ్ (హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ కాలేజీ), టి.అంజలీదేవి(కేయూ మహిళా ఇంజనీరింగ్ కాలేజీ), బానోత్ దివ్య (లాల్‌బహదూర్ కాలేజీ, వరంగల్), బానోత్ ఇందుప్రియ (ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, ఖమ్మం) ఎంపికయ్యారని నారాయణ తెలిపారు.

ఇద్దరు ఎస్సైల బదిలీ

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డి.పవన్‌కుమార్ వీఆర్ నుంచి పాలకుర్తికి, ఎం.సాయిప్రసన్నకుమార్ పాలకుర్తి నుంచి సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి



కేయూ క్యాంపస్/మడికొండ/ధర్మసాగర్ : పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాలను సందర్శించడంతోపాటు మడికొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల, బాలుర పాఠశాల, కళాశాల, ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీల్లో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాను ఇప్పటికే ఎమ్మెల్సీగా పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన అధ్యాపకుల సమస్యల్లో కొన్ని పరిష్కారం అయ్యాయని, మళ్లీ గెలిపిస్తే మిగిలిన వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయా సమావేశాల్లో ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, గడ్డం కృష్ణ, టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రాజు, పెండెం రాజు, సదానందం, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి, మాలిక తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ విచారణ

కాళేశ్వరంపై నేడు క్రాస్ ఎగ్జామినేషన్! | 'కాగ్' నివేదికలు ప్రామాణికం

- ఇరిగేషన్ అధికారులకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమాచారం
- 2024 'కాగ్' నివేదికలోని అంశాలపైన ఆరా తీయనున్న కమిషన్
- ఈనెల 29వరకు సాగనున్న విచారణ
- రిటైర్డ్ ఇంజనీర్లు, విధుల్లో ఉన్న ఉన్నతాధికారుల్లో కలకలం

సాక్షిప్రతినిధి, వరంగల్ :

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ బుధవారం నుంచి మళ్లీ విచారణ చేపట్టనుంది. ఈ మేరకు ఆయా ప్రాజెక్టుల పరిధిలోని మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు, పంపుహౌస్‌ల నిర్మాణంలో విధులు నిర్వర్తించిన అధికారులకు కమిషన్ సమాచారం అందించింది. గత ఏడాది అక్టోబర్ నుంచి ఇన్వెస్టిగేషన్ చేస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) నివేదికలను మరోసారి చర్చించనున్నట్లు పేర్కొంది. ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, వ్యయం, లోపాలపై ఈ ఏడాది ఫిబ్రవరిలో కంప్ట్రోలర్ ఆడిట్ జనరల్(కాగ్) విడుదల చేసిన నివేదికలను ప్రామాణికంగా తీసుకోనుంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు శంకుస్థాపన మొదలు.. ప్రారంభం వరకు కీలకంగా వ్యవహరించిన నల్లా వెంకటేశ్వర్లు(రిటైర్డు ఈఎన్‌సీ)తో పాటు ఆయన కనుసన్నల్లో.. ఆదేశాలు, సూచనల మేరకు పనిచేసిన చీఫ్, సూపరింటెండెంట్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో పాటు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను ఈసారి విచారించే అవకాశం ఉంది. ఆ అధికారులు ఇప్పుడు విధుల్లో ఉన్నా.. పదవీ విరమణ పొందినా అవసరమైతే వారిని విచారించేందుకు అందుబాటులో ఉండాలని ముందస్తు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, హనుమకొండ, హైదరాబాద్ ప్రాంతాల్లో నివాసం ఉండే పలువురికి కూడా సమాచారం అందినట్లు పేర్కొంటున్నారు. కొందరు ఇంజనీర్లు, రిటైర్డ్ ఇంజనీర్లు, ఉన్నతాధికారులకు రేపటి నుంచి మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్ జరగనుంది. 29వ తేదీ వరకు సాగే ఈ క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఎవరెవరికీ ఎప్పుడు సమాచారం వస్తుందో? అనే టెన్షన్‌లో ఉన్నారు.



ప్రాజెక్టుపై అభ్యంతరాలు..

- ప్రాజెక్టు లింకు-1 కింద 2016 జూలై నుంచి 2021 డిసెంబర్ మధ్య మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద 80 వేల క్యూసెక్కులు, 65 వేల క్యూసెక్కులు, 57 వేల క్యూసెక్కుల గరిష్ట వరద విడుదలను పరిగణలోకి తీసుకుని మూడు బ్యారేజీలు నిర్మించగా.. గేట్లను మూసివేసిన తరువాత, ఆర్‌సీసీ వేసిన కోటు, సీసీ కర్టెన్ గోడలలో కొంత భాగం, దిగువ భాగంలో నిర్మించిన సిమెంట్ కాంక్రీట్ బ్లాక్‌లు కొట్టుకుపోయి రూ.180.39 కోట్లు నష్టం వాటిల్లింది.



- విడుదలైన నీటి అధిక వేగం, శక్తిని తట్టుకునే విధంగా ఏర్పాటు చేయకపోవడమే ఈ నష్టానికి కారణమని సాగునీటి శాఖ చేసిన అధ్యయనాలు వెల్లడించడం.. మూడు బ్యారేజీలలోని నష్టాలను సరిదిద్దడానికి అంచనా వేసిన మొత్తం రూ.476.03 కోట్లకు సవరించిన అంచనాలను 'కాగ్' బహిరంగపర్చింది. సిమెంట్, కాంక్రీట్ దిమ్మెల ఆప్రాన్ లాంచింగ్ రూపకల్పన లోపభూయిష్టంగా ఉండటంతో ఈ పనులు ఉద్ధార వేగాన్ని తట్టుకోలేక కొట్టుకుపోయి రూ.180.39 కోట్ల నష్టం వాటిల్లినట్లు తేల్చింది.
- కాళేశ్వరం ప్రాజెక్టు లింకు-1 కింద చేపట్టిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, ఎత్తిపోతలకు వ్యయం విపరీతంగా పెంచి.. రూ.10,783.30 కోట్లతో అప్పగించిన పనుల విలువ రూ.21,297.11 కోట్లకు చేర్చారని 'కాగ్' పేర్కొంది. సవరించిన అంచనాలు, అనుబంధ ఒప్పందాలు, వర్క్‌స్లిప్‌ల ప్రకారం మేడిగడ్డ అంచనాలు 74 శాతం, అన్నారం బ్యారేజీ 77 శాతం, అన్నారం ఎత్తిపోతల వ్యయం రూ.1,669.23 కోట్ల నుంచి రూ.3,772.56 కోట్ల(126 శాతం)కు పెరిగిందని నివేదిక వెల్లడించింది. అలాగే సుందిళ్ల ఎత్తిపోతల ఖర్చు 106 శాతం పెరిగింది.
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ, పంపుహౌస్‌ల నిర్మాణ పనుల వ్యయం పెరిగినప్పటికీ 2018 ఫిబ్రవరి నుంచి ఆగస్టు మధ్యలో పూర్తి కావాల్సిన ఈ పనులు ఒక్కోటి 15 నెలల నుంచి 41 నెలల ఆలస్యంగా పూర్తయినట్లు ఆధారాలతో పేర్కొంది. ఈ బ్యారేజీల కోసం నిర్దేశించిన భూసేకరణ ఇంకా పూర్తి కాలేదని, 7,153.77 ఎకరాలకు గాను 5,240.78 ఎకరాలు సేకరించగా, భూముల ధరలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఇంకా 1,912.99 ఎకరాలు.. ఎప్పుడు, ఎలా సేకరిస్తారని ప్రశ్నించింది.

...వీటన్నింటితో పాటు ఎన్‌డీఎస్‌ఏ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికల్లో తేలిన లోపాలు, అంశాలపై సమగ్ర విచారణకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట హాజరు కావడానికి సంబంధిత ఇంజనీర్లు, ఉన్నతాధికారులు సిద్ధం కాగా.. ఈసారి విచారణలో ఏం తేలనుందో అనే ఉత్కంఠ ఆయా వర్గాల్లో కనిపిస్తోంది.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్ : జిల్లాలో రోడ్డు భద్రతతో పాటు ప్రమాదాల నివారణకు సంబంధించి పటిష్ట చర్యలు చేపట్టాలని హనుమకొండ కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రత కమిటీ చైర్మన్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యాన వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ(డీఆర్‌ఎస్‌సీ) సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై వరంగల్ ఎన్‌ఐటీ, ఎన్జీఓ సంస్థల ఆధ్వర్యాన విద్యాసంస్థల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సమావేశంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు, డీసీపీలు రవీందర్, సలీమా, ఏసీపీలు కిషోర్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, తిరుమల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

శిశుగృహ చిన్నారులకు మదర్ మిల్క్

కాజీపేట అర్బన్ : శిశు గృహలోని చిన్నారులకు జీఎంహెచ్ నుంచి మదర్ మిల్క్ అందజేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. హనుమకొండలోని శిశుగృహను మంగళవారం కలెక్టర్ ప్రావీణ్య సందర్శించి వసతులను పరిశీలించారు. శిశుగృహలో 11 మంది చిన్నారులు ఉన్నారని ఒకరు దత్తతకు ఎంపికయ్యారని, మరో ఇద్దరికి ప్రక్రియ జరుగుతుందని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి జయంతి కలెక్టర్‌కు వివరించారు. కాగా హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాలను కలిపి హనుమకొండ సెంటర్ పాయింట్‌గా ఒక యూనిట్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలను కలిపి మరో యూనిట్‌గా కొనసాగించాలన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి, అనిల్ చందర్‌రావు, సభ్యుడు సుధాకర్, ఎస్.ప్రవీణ్‌కుమార్, మౌనిక, నగేష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి



వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

- సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం : బాణాసంచా విక్రయించే వ్యాపారులు అనుమతితో పాటు భద్రతా ప్రమాణాలు పాటించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. దీపావళి వేళ బాణాసంచా వ్యాపారులతో మంగళవారం కమిషనరేట్‌లో సీపీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అగ్నిమాపక, పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాణాసంచా విక్రయించే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. అగ్నిమాపక విభాగం నుంచి ఎన్‌ఓసీ పొందాలని, దీంతో పాటు స్థల యజమాని అనుమతి పత్రం తప్పక ఉండాలని తెలిపారు. ముఖ్యంగా అగ్ని ప్రమాదాల నివారణకు ఇసుక, నీరు, ఇతర సామగ్రి అందుబాటులో ఉండేలా, వీలైనంత వరకు వ్యాపారస్తులు తమ వ్యాపారాన్ని విశాలమైన ప్రదేశాల్లో నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. అనుమతి లేకుండా బాణాసంచా వ్యాపారం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక తనిఖీ చేస్తారని వివరించారు. ఎవరైనా అనుమతి లేకుండా బాణాసంచా వ్యాపారం నిర్వహిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీపీ తెలిపారు. సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీధర్ రెడ్డి, అదనపు డీసీపీ రవితో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మడికొండ: రక్తదానం ప్రాణదానంతో సమానమని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కాజీపేట ఏసీపీ సర్కిల్ పరిధి మడికొండలోని రాజరాజేశ్వర కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కాజీపేట, మడికొండ, ధర్మసాగర్, ఎల్కతుర్తి వేలేరు, పోలీస్‌స్టేషన్‌ల పరిధి యువకులు, పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు, పండ్లు, హెల్త్ డ్రింక్స్ అందజేశారు.

ఎంజీఎంలో రక్షణ కరువు

- ఆస్పత్రిలో సెక్యూరిటీ సేవల లోపం
- ఉద్యోగుల బయోమెట్రిక్ పరికరాల చోరీ
- నామ మాత్రపు సేవలు.. సిబ్బంది కొరత
- నూరు శాతం బిల్లుల చెల్లింపు
- చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం



ఎంజీఎంలో దొంగతనానికి గురైన రెండు బయోమెట్రిక్ పరికరాలు, అనుమానితుడి ఫొటో

ఎంజీఎం : ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వరుస దొంగతనాలు.. రోగులకు కనీసం రక్షణ లేకుండా పోయింది.. చివరకు మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్నా దిక్కులేని పరిస్థితి నెలకొంది. వీటన్నింటిపై దృష్టి పెట్టాల్సిన సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం అధికారులకు తలనొప్పిగా మారింది. వైద్యులు, వైద్య సిబ్బంది హాజరుపై కలెక్టర్ దృష్టి పెట్టగా.. విధులకు డుమ్మా కొట్టే అధికారులు సరికొత్త విధానానికి తెరతీసి ఏకంగా అటెండెన్స్ నమోదు చేసే బయోమెట్రిక్ పరికరాలు చోరీ చేశారు. సోమవారం అర్ధరాత్రి తర్వాత ఆస్పత్రిలో పరిపాలనాధికారి కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న మినిస్టీరియల్, పారామెడికల్ సిబ్బంది అటెండెన్స్ నమోదు చేసే బయోమెట్రిక్ పరికరాలను అపహరించారు.

ఎంజీఎంలో 1,500 పడకలకు గాను 1,250 పడకలు ప్రస్తుతం ఆస్పత్రి ప్రాంగణంలో ఉండగా.. 250 కేఎంసీలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో కొనసాగుతున్నాయి. రోగుల మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం నెలకు ఏకంగా కోటి రూపాయలకు పైగా బిల్లులు చెల్లిస్తూ.. శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సేవలకు ఓ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వచ్చింది. కాగా ఆస్పత్రిలో సెక్యూరిటీ సిబ్బంది వైఫల్యంతో కొన్ని నెలలుగా రోగులకు సంబంధించి ఆభరణాలు.. అటెండెంట్ల ద్విచక్ర వాహనాలు, ఆస్పత్రిలో పలు పరికరాలు మాయమవుతున్నాయి.

పర్యవేక్షణాధికారి ఎవరు.?

ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాలకు సంబంధించిన పర్యవేక్షణ అధికారి ఎవరో తెలియని పరిస్థితి. గత సూపరింటెండెంట్ హయాంలో సెక్యూరిటీ కాంట్రాక్టర్ విషయంలో ఎవరూ జోక్యం చేసుకోకుండా.. ఆస్పతిలో ఎన్ని దొంగతనాలు జరిగినా అధికారులు మెమోలు ఇవ్వకుండా వంద శాతం బిల్లులు మంజూరు చేశారు.

రెండు బయోమెట్రిక్ పరికరాలు చోరీ

ఎంజీఎం ఆస్పత్రిలో ఉద్యోగుల హాజరు శాతం నమోదు చేసే రెండు బయోమెట్రిక్ పరికరాలు సోమవారం సాయంత్రం 5.30 నుంచి 6 గంటల మధ్య చోరీకి గురైనట్లు గుర్తించాం. ఆస్పత్రి ఆర్‌ఎంఓ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశాం. సీసీ పుటేజీల ద్వారా ఓ అనుమానితుడిని గుర్తించాం. ఆస్పత్రిలో పరికరాల చోరీపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్య తీసుకుంటాం.

– డాక్టర్ మురళి,
ఎంజీఎం సూపరింటెండెంట్

జీఓ 29తో బీసీలకు అన్యాయం

సుందర్‌రాజుయాదవ్



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న నాయకులు

హన్మకొండ : జీఓ 29తో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీసీ పొలిటికల్ జేఏసీ హనుమకొండ జిల్లా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్ అన్నారు. బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో జీఓ 29కు వ్యతిరేకంగా హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుందర్‌రాజుయాదవ్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ప్రతినిధులు గడ్డం భాస్కర్, డాక్టర్ కాశీప్రసాద్, డాక్టర్ లక్ష్మిప్రసాద్ మాట్లాడారు. జీఓ 29 తీసుకువచ్చి రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మరణ శాసనం రాసిందని ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమానికి వరంగల్ ఎలా కేంద్రమైందో.. అదే తరహాలో ఇక్కడి నుంచి మరో బీసీ ఉద్యమం ఉద్భవిస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయడంతో పాటు ఉద్యోగ నియామకాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులకు ప్రభుత్వం సింహభాగం కేటాయించాలని అన్నారు. ఈ నిరసనలో బీసీ సంఘాల నాయకులు పులి రజనీకాంత్, సాయిని నరేందర్, క్రాంతి, శ్రీకాంత్, రాకేష్, శరత్ చంద్ర, వేణు, కోటేశ్వర్, దువ్వ కనుకరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటన

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే జంక్షన్ పరిధి సమస్యల పరిష్కారం, అయోధ్యపురం రైల్వే వ్యాగన్ పీఓహెచ్ షెడ్ నిర్మాణ పనులు, అభివృద్ధి ఇతర అంశాలపై నేడు(బుధవారం) ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు పర్యటించనున్నట్లు మంగళవారం రైల్వే అధికారులు తెలిపారు. పర్యటనలో భాగంగా కాజీపేట రైల్వే ఆస్పత్రి, జంక్షన్‌లో అమృత్ భారత్ పనుల పరిశీలన అనంతరం కార్మికుల సమస్యలపై రైల్వే అధికారులతో చర్చించనున్నట్లు అధికారులు తెలిపారు.

నరక 'దారి'



దెబ్బతిన్న హసన్‌పర్తి-పెంబర్తి రోడ్డు

హసన్‌పర్తి: హసన్‌పర్తి–పెంబర్తి రహదారిపై అడుగడుగునా గుంతలే. ఈ రోడ్డు మీదుగా నిత్యం ప్రయాణించే వందలాది మంది నరకం చూస్తున్నారు. వర్షాకాలంలో ఎక్కడ గొయ్యి ఉందో తెలియక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. ఇప్పటికే పలువురు ఆస్పత్రుల పాలయ్యారు. రాత్రి వేళ వాహనచోదకులు ఈ మార్గంలో వెళ్లడంలేదు. పెంబర్తి నుంచి ఆరు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. రోడ్డు అధ్వానంగా మారడంతో ఉదయం, సాయంత్రం వరంగల్ నుంచి పెంబర్తి వరకు వచ్చే ఆర్టీసీ బస్సు సైతం రద్దు చేశారు. విద్యార్థులు చదువుకోవడానికి రెండు కిలోమీటర్ల దూరం కాలినడకన హసన్‌పర్తికి రావాల్సి వస్తోందని స్థానికులు చెప్పారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా..



పెంబర్తి–హసన్‌పర్తి రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు మరమ్మతు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి అనేకమార్లు తీసుకెళ్లాం. ఇటూ రోడ్డుపై గుంతలు.. మరో వైపు బస్సుల రద్దుతో చాలా మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్లడం లేదు. రోడ్డు మరమ్మల్లు చేపట్టి కనీస సౌర్యాలు కల్పించాలి.

– చాతళ్ల వేణుగోపాల్, పెంబర్తి

నిబంధనలు పాటించాలి



గూడెప్పాడ్‌లో నర్సరీని పరిశీలిస్తున్న వెంకటేశం

ఆత్మకూరు : నర్సరీ యజమానులు నిబంధనలు పాటించాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి వెంకటేశం అన్నారు. గుడెప్పాడ్‌లో మిరప, కూరగాయల నర్సరీలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీ యజమానులకు నర్సరీ చట్టం–2017 ప్రకారం మొక్కల నాణ్యత, రిజిస్టర్ల నిర్వహణ, మొక్కలు కొనుగోలు చేసిన రైతులకు విధిగా బిల్లు ఇవ్వడం, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు పాటించని నర్సరీ యజమానులపై రూ.50 వేల జరిమానా లేదా లైసెన్స్‌లను రద్దు చేస్తానని హెచ్చరించారు. అనంతరం ఆయిల్ పామ్ తోటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయిల్‌పామ్ సాగు కోసం రైతులు ముందుకు రావాలని, ప్రభుత్వం అందించే రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారులు రాకేష్, మధులిక తదితరులు పాల్గొన్నారు.

ఏఈఓల సస్పెన్షన్‌పై భిన్న స్వరాలు

- హనుమకొండ జిల్లాలో ఐదుగురిపై వేటు
- డిజిటల్ సర్వేకు స్పందించలేదని చర్చ

హన్మకొండ : వ్యవసాయ విస్తరణాధికారుల(ఏఈఓ) సస్పెన్షన్‌పై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. రైతు బీమా మార్గదర్శకాలు పాటించలేదని పేర్కొంటూ రాష్ట్రంలో 160 మందికి పైగా ఏఈఓలను సస్పెండ్ చేయగా.. అందులో హనుమకొండ జిల్లాకు సంబంధించి ఐదుగురు ఉన్నారు. రాష్ట్రంలో సెప్టెంబర్ 24 నుంచి డిజిటల్ సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు సర్వే ప్రారంభం కాలేదు. ఈ క్రమంలో ఏఈఓలను సస్పెన్షన్ చేయడం వెనుక డిజిటల్ సర్వే చేపట్టకపోవడమే పరోక్ష కారణమై ఉంటుందని వ్యవసాయ శాఖలో అధికారులు, ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం రైతు బీమా ద్వారా మృతిచెందిన రైతు కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందిస్తుంది. రైతు చనిపోయిన మూడు రోజుల్లో సంబంధిత వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలి. అలాగే 10 రోజుల్లో డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేసి చెక్కును రైతుకు అందించాలని గైడ్ లైన్స్‌లో ఉంది. ఈ నిబంధనలు పాటించనందున ఏఈఓలను సస్పెండ్ చేశారని వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగులు తెలిపారు. సాధారణంగా డెత్ సర్టిఫికెట్ పొందడానికి ఒక్కో సమయంలో చాలా రోజులు పడుతుందని, దీనికి ఏఈఓలను బాధ్యులను చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రమాదవశాత్తు రైతు మరణిస్తే పోలీసు ఎఫ్‌ఐఆర్, ఆ తర్వాత డెత్ సర్టిఫికెట్ తీసుకోవడం ఆలస్యమవుతుందని, వేరే ప్రాంతంలో చనిపోయినప్పుడు కూడా ఆలస్యమవుతుందని ఇందుకు ఏఈఓలను బాధ్యులను చేయడం సరికాదన్నారు. హనుమకొండ జిల్లాలోని రాంపూర్ ఏఈఓ పాము రజిత, శాయంపేట ఏఈఓ బొచ్చు అర్చన, పెద్దాపూర్ ఏఈఓ గుజ్జుల ప్రవళిక, కాజీపేట ఏఈఓ బి.భరత్, కొండపర్తి ఏఈఓ ఎండీ ఆఫ్రీన్ సస్పెన్షన్‌కు గురయ్యారు. సస్పెన్షన్‌కు డిజిటల్ సర్వే కారణమై ఉంటుందని, ఆ కారణంతో చర్యలు తీసుకోకుండా ఏఈఓలపై మానసికంగా ఒత్తిడి పెంచేందుకే రైతు బీమా గైడ్‌లైన్స్ పాటించలేదని సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారని వ్యవసాయ అధికార, ఉద్యోగ వర్గాలు పేర్కొన్నాయి. ప్రభుత్వం డిజిటల్ సర్వే చేసేలా భయపెట్టి ఒప్పించేందుకు ఈ చర్యలు తీసుకుని ఉంటారని ఉద్యోగ వర్గాలు భావిస్తున్నాయి. తమకు సౌకర్యాలు కల్పిస్తే సర్వే చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నా.. ప్రభుత్వమే స్పందించడం లేదని ఏఈఓలు వాపోయారు.

కళాకారులను ఆదుకోవాలి

● వస్తాద్ బిస్మిల్లాఖాన్ అవార్డు గ్రహీత ఒగ్గు రవి



లింగాలఘణపురం: కళ బతకాలంటే కళాకారులు బతకాలి.. అందుకే కళాకారులను ఆదుకోవాలని వస్తాద్ బిస్మిల్లాఖాన్ అవార్డు గ్రహీత ఒగ్గు రవి అన్నారు. భారత ప్రభుత్వం సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యాన ఈనెల 15 నుంచి 21 వరకు న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ నృత్యమహోత్సవంలో ఆయన తెలంగాణ జానపద కళలపై వివరించారు. 'జానపద కళలు.. గురుశిష్యుల పరంపర' అనే అంశంపై చర్చించారు. రవి మాట్లాడుతూ.. కళాకారులకు ఆరోగ్య, జీవిత బీమా సదుపాయంతోపాటు శిక్షణ తరగతులు, ప్రదర్శనలకు తగిన వనరులు కల్పించాలన్నారు. మధుర ఎంపీ హేమామాలిని, ఎస్ఎన్ఏ చైర్మన్ సంధ్యాపురేశ్నా, సెక్రెటరీ రాజుదాసు పాల్గొన్నారు.

కేయూలో విద్యార్థులకు హాస్టల్ వసతి

ఫస్టియర్ స్టూడెంట్లకు మెస్ కార్డులు

● ఫైనల్ ఇయర్ విద్యార్థులకు రెన్యూవల్



కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ రాజ్‌కుమార్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరంలో పీజీ కోర్సులతో పాటు ఇతర కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు క్యాంపస్‌లోని హాస్టళ్లలో వసతి కల్పించనున్నారు. మొదటి సంవత్సరంలో ప్రవేశాలు, రిపోర్టింగ్ ఈనెల 21న పూర్తికాగా హాస్టళ్లలో విద్యార్థులకు వసతి కల్పన మంగళవారం నుంచి ఇస్తున్నారు. ఓసీ విద్యార్థులకు రూ.12వేలు, బీసీలకు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.8వేలు, పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.6వేల చొప్పున డిపాజిట్ ఫీజుగా చెల్లిస్తే మెస్‌కార్డులు జారీ చేస్తున్నారు. కేయూలో మొత్తం 14 హాస్టల్స్ ఉన్నాయి.



హాస్టల్ వసతికి దరఖాస్తులు ఇస్తున్న విద్యార్థులు

ఫైనల్ ఇయర్ విద్యార్థులకు రెన్యూవల్..

ఫైనల్ ఇయర్ విద్యార్థులకు కూడా మెస్ కార్డులు రెన్యూవల్ చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు వచ్చే విద్యార్థులకు రూ .1,000 ఫీజు చెల్లిస్తే హాస్టల్ కేటాయిస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పరిధిలోకి రాని విద్యార్థులు మాత్రం గతేడాదిలో మెస్ బకాయిల్లో సగం చెల్లిస్తేనే మెస్ కార్డులు రెన్యూవల్ చేస్తున్నారు. అలాగే, క్యాంపస్‌లోని వివిధ విభాగాల్లోని రెగ్యులర్, ఎస్ఎఫ్‌సీ కోర్సుల వారికి కూడా హాస్టల్ వసతి కల్పిస్తున్నారు. కాగా, కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇప్పటికే విద్యార్థులకు వసతి కల్పించారు. సుబేదారిలోని 'లా' హాస్టల్స్‌లో కూడా వసతి కల్పిస్తున్నారు. మహిళా ఇంజనీరింగ్ విద్యార్థినులకు మాత్రం హాస్టల్ వసతి లేదు.

28తేదీ వరకు రెన్యూవల్ చేసుకోవాల్సిందే..

ఫైనల్ ఇయర్ విద్యార్థులు హాస్టల్ వసతి పొందేందుకు ఈనెల 28వతేదీ వరకు మాత్రమే మెస్ కార్డులు రెన్యూవల్‌కు గడువు ఉందని ఆ తరువాత వచ్చేవారికి మెస్ కార్డులు జారీ చేయబోమని కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య సీహెచ్. రాజ్‌కుమార్ తెలిపారు. వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొంది హాస్టల్ వసతి కోసం దరఖాస్తులు చేసుకున్న విద్యార్థుల నుంచి అండర్ టేకింగ్ తీసుకుంటున్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు యూనివర్సిటీ నియమ నిబంధనల ప్రకారం తరగతుల అటెండెన్స్‌ను కూడా మెయింటెనెన్స్ చేసుకోవాల్సింటుందని కూడా అందులో పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి



ఎస్‌డీఎల్‌సీఈలో అధ్యాపకులకు ఓటరు నమోదు పత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీపాల్‌రెడ్డి, పీఆర్‌టీయూ బాధ్యులు

కేయూ క్యాంపస్: విద్యారంగ, ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల, ఎస్‌డీఎల్‌సీఈ, హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వరంగల్ కిట్స్, ఆశ్రమ పాఠశాలలను సందర్శించి ఓటరు నమోదుపై ప్రచారం నిర్వహించారు. పీఆర్‌టీయూ టీఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉండబోతున్నానని, తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జిల్లా జనరల్‌సెక్రటరీ పి. శ్రీహరి, బాధ్యులు అబ్దుల్‌గఫర్, దేవిరెడ్డి మాలకొండారెడ్డి, దండ కోమల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, రాండ్ల భానుప్రసాద్‌రెడ్డి, విజయ్‌కుమార్, రాజేందర్, కరీంనగర్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జాలి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

బీసీ హక్కుల సాధనకు పోరాడాలి

● రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

హన్మకొండ : రాజ్యాధికారం కోసం బీసీలు సమష్టిగా పోరాటం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని సంఘం కార్యాలయంలో జిల్లా సమావేశం బత్తిని సదానందం గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వెంకట్రాములు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని, మంత్రివర్గంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. బీసీల న్యాయమైన డిమాండ్లను విస్మరిస్తే బీసీల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే కులగణన పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. బీసీ కులగణన రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ నెల 28న హైదరాబాదులో జరగనున్న బీసీ రాష్ట్ర సదస్సుకు బీసీలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు జక్కురాజు, అనుకారి అశోక్, ప్రవీణ్, రమేష్, కర్రె లక్ష్మణ్, మాలోత్ శంకర్ నాయక్, పోచయ్య, బి.మల్లయ్య, అంకుషావలి, కోరపల్లి రమాదేవి, కనకలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ప్రారంభం

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఇండియన్ రెడ్‌క్రాస్ కమిటీ సభ్యుడు ఈవీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు అర్జున్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆటలో ఏకాగ్రత, పట్టుదల నిలుపుకున్నప్పుడే లక్ష్యం చేరుకుంటారన్నారు. టోర్నమెంట్ల నిర్వహణతో క్రీడాకారుల్లోని ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. టోర్నమెంట్ నిర్వాహకుడు కన్నా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వంద మంది పాల్గొన్నారని, ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులలో నలుగురు బాలికలు, నలుగురు బాలురను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఆర్బిటర్లు సాయిప్రదీప్, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

డమ్మీ తుపాకీతో బెదిరించిన వ్యక్తి అరెస్ట్

దామెర: డమ్మీ తుపాకీతో బెదిరించి డబ్బులు వసూళ్లకు పాల్పడిన వ్యక్తిని దామెర పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు మంగళవారం పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్.. దామెర పీఎస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిశోర్ కుమార్

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన రాయల వెంకటేశ్వర్లు 2006లో ప్రజాప్రతిఘటన పార్టీలో కొరియర్‌గా పనిచేసి 2007లో ఖమ్మం ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. తరువాత ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో హైదరాబాద్‌లో డమ్మీ తుపాకీ కొనుగోలు చేసి బెదిరించి డబ్బులు వసూలు చేయాలని నిర్ణయం తీసుకున్నాడు. ఇందులో భాగంగా ఈ నెల 21న దామెర మండలం ఊరుగొండకు చేరుకుని అర్ధరాత్రి 12 గంటలకు కందికొండ సంపత్ కిరాణాషాపునకు వెళ్లి షట్టర్ కొట్టి లేపాడు. అనంతరం డమ్మీ తుపాకీ చూపించి రూ. రెండు వేలు తీసుకున్నాడు. వెంటనే తేరుకున్న సంపత్.. వెంకటేశ్వర్లును పట్టుకొని కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చారు. డయల్ 100కు కాల్ చేయగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. అనంతరం వెంకటేశ్వర్లుపై కేసు నమోదుచేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వెంకటేశ్వర్లు గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు నేరాలకు పాల్పడగా పోలీసులు అతడిపై 15 కేసులు నమోదుచేసినట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఏసీపీ వెంట పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు, దామెర ఎస్సై కొంక అశోక్, ఏఎస్సై రమేశ్, సిబ్బంది ఉన్నారు.

రైలునుంచి జారి పడి వ్యక్తి మృతి

కాశిబుగ్గ: రైలు నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ సురేందర్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా, మండలం పెద్ద కల్వలకు చెందిన కల్వల వెంకటేశ్(33) హోమ్ కేర్ సర్వీసెస్‌లో పని చేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి డోర్నకల్, కాజీపేట మెమో ఎక్స్‌ప్రెస్ రైలు(07754)ను వరంగల్ రైల్వే స్టేషన్‌లో 2, 3 ప్లాట్‌ఫామ్ మధ్య ఎక్కుతూ జారి రైలు, ప్లాట్‌ఫామ్ మధ్యలో పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ సుదర్శన్ కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి బంధువులు భాస్కర్, మనోజ్‌కు అప్పగించామని జీఆర్పీ సీఐ తెలిపారు.

కొండచిలువ కలకలం

ఎంజీఎం : ఎంజీఎం ఎదుట ఉన్న ఐఎంఏ హాల్ సమీపంలోని ఏటీఎం వద్ద అర్ధరాత్రి కొండ చిలువ కలకలం సృష్టించింది. కొండ చిలువ కనబడడంతో సిబ్బంది అప్రమత్తమై వెంటనే స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అతడు వచ్చి కొండ చిలువ పట్టుకోవడం అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

అధిక సాంద్రత పత్తి సాగు చేయాలి

మామునూరు/ సంగెం : అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం వల్ల అధిక దిగుబడి, ఆదాయం పొందొచ్చని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న, శాస్త్రవేత్త సౌమ్య అన్నారు. మంగళవారం గీసుకొండ మండలంలోని ఎలుకుర్తి హవేలీ, అనంతారం గ్రామాల్లోని అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన క్షేత్రాలను కేంద్రియ పత్తి పరిశోధన స్థానం నాగ్‌పూర్ శాస్త్రవేత్తలు శరవన్, డాక్టర్ హోంరాజ్ బృందం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం వల్ల పంటకాలం త్వరగా పూర్తవడంతో గులాబీరంగు పురుగు ఉధృతి తట్టుకుటుందన్నారు. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఖిలా వరంగల్, గీసుకొండ వ్యవసాయాధికారులు రవీందర్‌రెడ్డి, హరిప్రసాద్, ఏఈఓ స్మిత, కేవీకే ప్రొఫెషనల్ హర్షరెడ్డి, సాయి, సుశ్రుత్, రైతులు పాల్గొన్నారు.



పత్తిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు వాయిదా

వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్–19 బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ఎస్‌జీఎఫ్ అండర్–19 కార్యదర్శి, డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీన నిర్వహించాల్సిన ఈ పోటీలు తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

నిట్‌లో ఎఫ్‌డీపీ ప్రోగ్రాం ప్రారంభం

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ(ఈ అండ్ ఐసీటీ) అకాడమీ ఆధ్వర్యాన పది రోజుల పాటు జరిగే ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ ప్రోగ్రాంను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఆప్టిమైజేషన్ టెక్నిక్స్ అనే అంశంతో ప్రాక్టీస్ అండ్ ఎమర్జింగ్ అప్లికేషన్స్‌పై ఏర్పాటు చేసిన ఎఫ్‌డీపీ విద్యాబోధన అధ్యాపకులకు తోడ్ప డుతుందన్నారు. ఈ ఆన్‌లైన్ ప్రోగ్రాంలో దేశవ్యాప్తంగా 31 ఎన్ఐటీల అధ్యాపకులు పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలను వ్యతిరేకించాలి

● ఎంసీపీఐ(యూ)పొలిట్ బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి

హన్మకొండ : మతోన్మాద దోపిడీ విధానాలను వ్యతిరేకించాలి..అందుకు ప్రత్యామ్నాయమే మార్క్సిజమని, ఆ దిశగా పోరాడేది ఎంసీపీఐ(యూ) మాత్రమేనని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ అలంకార్ కూడలిలోని కర్ర రాజిరెడ్డి నివాసంలో ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపకుడు మద్దికాయల ఓంకార్ చిత్రపటానికి ఎంసీపీఐ(యూ) నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదపు అంచుల్లో ఉందని, ఒకే దేశం..ఒకే ఎన్నిక..ఒకే మతం అంటూ భిన్నత్వంలో ఏకత్వాన్ని.. లౌకిక విలువలను మంటగల్పుతున్నారని తూర్పారబట్టారు. అంబేడ్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులను అమలు చేయకుండా అడ్డుకుంటున్నారని, అంబేడ్కర్ ఆలోచన విధానాలను మంట కలుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంస రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి నీలా రవీందర్, కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, కర్ర రాజి రెడ్డి, చీపురు ఓదయ్య, కమిటీ సభ్యులు ఎండీ ఉస్మాన్ పాల్గొన్నారు.

ఇంటినుంచి వెళ్లగొట్టారు న్యాయం చేయండమ్మా..

● అదనపు కలెక్టర్‌ను వేడుకున్న వృద్ధురాలు

కాళోజీ సెంటర్ : తన కుమారుడు, కోడలు అక్రమంగా తన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకుని తనను వెళ్లగొట్టారని, దీనిపై స్పందించి న్యాయం చేయాలని పర్వతగిరి మండలం చింత నెక్కొండకు చెందిన కాసాని కొమురమ్మ.. అదనపు కలెక్టర్ సంధ్యారాణిని వేడుకుంది. ఈమేరకు మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణిని కలిసి కుమారుడు, కోడలు కలిసి తనకు చేసిన అన్యాయాన్ని వివరించారు. గ్రామానికి చెందిన కాసాని కొమురమ్మ, చిన్న కొమురయ్య దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. తన పేరు మీద తన భర్త కొమురయ్య గతంలో వర్ధన్నపేట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించాడు. దీనిని చిన్న కుమారుడు కాసాని మల్లికార్జున్, చిన్న కోడలు అమూల్య అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని తనను ఇంటి నుంచి వెళ్లగొట్టి రోడ్డున పడేశారని కన్నీరుమున్నీరుగా విలపించింది. దీనిపై స్పందించి తనకు న్యాయం చేయాలని అదనపు కలెక్టర్‌ను వేడుకుంది.



ఆపన్న హస్తం అందించరూ!

● గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వేణుగోపాల్‌రావు
● ఆపరేషన్‌కు వర్తించని ఆరోగ్యశ్రీ
● దాతల సాయం కోసం ఎదురుచూపు



దీన గాథ

పర్వతగిరి: అసలే నిరుపేద.. పని చేస్తేనే ఐదు వేళ్లు నోట్లికి వెళ్లేది. లేదంటే పస్తులే. ఇంత దయనీయ పరిస్థితి అనుభవిస్తున్న ఆ ఇంటి పెద్దకు పెద్ద రోగం వచ్చింది. ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ చాలీచాలని జీతంతో కుటుంబాన్ని ఎలగోలా నెట్టుకొస్తుండగా ... మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా మాయదారి మహమ్మారి అతడిని పట్టి పీడిస్తోంది. దీంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఇంటి పెద్దను కాపాడుకోవడానికి దాతల సాయం కోస వెయ్యి కండ్లతో ఎదురుచూస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన బొంపెల్లి గోపాల్‌రావు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ చాలీచాలని జీతంతో కుటుంబాన్ని పోషించుకుంటూ అద్దె ఇంట్లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గోపాల్‌రావు గుండెలో మూడు బ్లాకులు ఏర్పడ్డాయి. దీంతో బెలూన్స్ ద్వారా ఆపరేషన్ చేస్తేనే బతుకుతాడని వైద్యులు తెలిపారు. దీనికి ఆరోగ్యశ్రీ వర్తించదని, రూ.5లక్షల వరకు ఖర్చు అవుతుందని వివరించారు. దీంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు వద్దకు తీసుకెళ్లగా రూ.2.5లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ ఇప్పించారు. ఇంకా రూ.2.5లక్షలు అవసరం కాగా ఆపరేషన్ చేయించుకోలేదు. దీనిపై దాతలు ముందుకు వచ్చి తనకు ఆర్థిక సాయం చేయాలని వేణుగోపాల్‌రావు, అతడి భార్య, కుటుంబీకులు వేడుకుంటున్నారు. దాతలు **9491176210** నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా లేదా కెనరా బ్యాంకు అకౌంట్ నంబర్ **110126379345**, ఐఎఫ్ఎస్‌సీ నంబర్ సీఎన్‌ఆర్‌బీ **0013607**కు సాయం చేయాలని వేణుగోపాల్‌రావు, అతడి భార్య విజ్ఞప్తి చేస్తున్నారు.



మంచానికే పరిమితమైన వేణుగోపాల్‌రావు

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి సమాజసేవ శిక్ష


వరంగల్ క్రైం: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టబడిన 107 మందిని కోర్టులో హాజరుపరుచగా 100 మందికి రూ. 1,42,400 జరిమానా విధించి ఏడుగురికి రెండు రోజులు సమాజసేవ చేయాలని న్యాయమూర్తి కె. విద్యాసాగర్ శిక్ష విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. రెండు రోజులు సమాజ సేవ చేయాలని పుట్ట శ్రీను, రేవోజు శ్రీనివాస్, మున్నా అలం, జల్లి యాకూబ్, మట్టుపల్లి శివ, కుమ్మరి శ్రీకాంత్, అన్నారపు కిషన్‌ను కోర్టు ఆదేశించింది. దీంతో తీర్పుననుసరించి కాజీపేట సర్కిల్ మున్సిపల్ కమిషనర్, హనుమకొండ మున్సిపల్ కమిషనర్ ఎదుట హాజరుపరిచినట్లు ట్రాఫిక్ ఏసీపీ తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన 14 మందికి రూ. 12 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ పేర్కొన్నారు.

దీపావళి పండుగల వేళ.. పటాకుల దందా!

● సుమారు రూ.కోటి 80 లక్షల బాణాసంచా సీజ్
● టాస్క్‌ఫోర్స్ దాడుల్లో బయటపడుతున్న అక్రమ డంప్‌లు

వరంగల్: దీపావళి పండుగల వేళ వరంగల్ జిల్లాలో పటాకుల అక్రమ దందా జోరుగా నడుస్తోంది. పండగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగానే భారీగా బాణాసంచాను తెచ్చి గోదాముల్లో నింపేస్తున్నారు. అనుమతులతో పాటు కనీస భద్రతా చర్యలు కూడా తీసుకోకుండానే నిల్వ చేస్తున్నారన్న పక్కా సమాచారంతో వరంగల్ టాస్క్‌ఫోర్స్ బృందం చేసిన తనిఖీల్లో పెద్ద ఎత్తున బాణాసంచా డంపులు బయటపడ్డాయి. వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా ఆదేశాల మేరకు మంగళవారం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆధ్వర్యాన టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్ పోలీసులు నమ్మదగిన సమాచారం మేరకు వరంగల్ ఓల్డ్‌బీట్ బజార్‌లోని వజినేపల్లి రమేష్ అండ్ బ్రదర్స్, శ్రీసాయి ఫైర్ క్రాకర్స్‌లో తనిఖీలు నిర్వహించగా సుమారు రూ.కోటి 80 లక్షల విలువ గల ఫైర్ క్రాకర్స్(బాణాసంచా) ఎలాంటి అనుమతులు లేకుండానే అమ్మడానికి అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. విచారణలో భాగంగా పండగల సీజన్ సమీపిస్తుండగా వరంగల్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన కొందరు వ్యాపారులు వివిధ ప్రాంతాల నుంచి భారీగా పటాకులు తెప్పిస్తూ అనుమతులు లేకుండానే డంప్ చేస్తున్నట్లు తేలిందన్నారు. దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలికంగా బాణాసంచా విక్రయాలకు అనుమతి కోసం ఆసక్తి ఉన్న వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని సీపీ అంబర్‌కిషోర్‌ఝా తెలిపారు. బాణాసంచా అక్రమ డంప్‌ను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్, ఆర్ఎస్సై శరత్‌కుమార్, సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

వీసీకి అభినందనల వెల్లువ



వీసీ ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రొఫెసర్లు తదితరులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా (వీసీ) బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డిని మంగళవారం యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్, బీఓఎస్ చైర్‌పర్సన్ కృష్ణవేణి, అధ్యాపకులు సన్మానించి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, కేయూ కాంట్రాక్టు అధ్యాపకల సంఘం జేఏసీ బాధ్యులు వీసీని సన్మానించారు. అనంతరం కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను వీసీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం బోధనేతర కాంట్రాక్టు ఉద్యోగ సంఘాల బాధ్యులు, కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం బాధ్యులు వీసీని కలిసి సన్మానించారు.

జూనియర్ అసిస్టెంట్లకు వార్డు అధికారులుగా బాధ్యతలు

వరంగల్ : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 10మంది వార్డు అధికారులు బదిలీ అయ్యారు. ప్రస్తుతం కార్పొరేషన్‌లో పన్నులు వసూళ్లలో నెలకొన్న ఇబ్బందుల వల్ల కార్పొరేషన్‌లోని వీఆర్వో/జూనియర్ అసిస్టెంట్లకు వార్డు అధికారులుగా బాధ్యతలు అప్పగిస్తూ గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉత్తర్వులు జారీ చేశారు. సైనీ ముత్యం, వీఆర్ఓ /జూనియర్ అసిస్టెంట్ డివిజన్ నంబర్ 1లో సురేందర్ స్థానంలో వార్డు అధికారిగా సీహెచ్.అజయ్‌కుమార్, 5వార్డు అధికారిగా డి.రవి, 23వ డివిజన్ ఎం.మానస, 39వ డివిజన్ సీహెచ్. శ్రీశైలం, 47వ డివిజన్ ఎ.కృష్ణారావు, 49వ డివిజన్ ఎ.శివరాజ్, 50వ డివిజన్ పి.మల్లయ్య, 51వ డివిజన్ వార్డు అధికారిగా ఎ.సందీప్ సీ–3 సెక్షన్ వార్డు అధికారిగా పి.శ్రవణ్‌కుమార్ ప్రధాన కార్యాలయంలోని క్యాష్ కౌంటర్‌లో విధులు నిర్వహించేందుకు కమిషనర్ బదిలీ చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విధుల్లోకి జీవన్‌కుమార్..

ఇటీవల సస్పెన్షన్‌కు గురైన బల్దియా సూపరింటెండెంట్ జీవన్‌కుమార్‌ను తిరిగి విధుల్లోకి తీసుకుంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు ఆయన విధుల్లోకి చేరినట్లు తెలిసింది.

కాకతీయ శిల్పకళా సౌందర్యం మహాద్భుతం

● వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్

ఖిలా వరంగల్: కాకతీయుల నిర్మాణాలు, శిల్పకళా సౌందర్యం మహాద్భుతంగా ఉన్నాయని వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్ అన్నారు. ఖిలా వరంగల్‌కోటలోని శిల్పాల ప్రాంగణాన్ని వారు మంగళవారం సందర్శించారు. కాకతీయులు కీర్తితోరణాల నడుమ ఉన్న శిల్ప సంపదతోపాటు ఖుష్‌మహల్, రాతి, మట్టికోటలు, ఏకశిలగుట్ట, శృంగారపు బావిని తిలకించారు. కాకతీయుల చరిత్ర, విశిష్టతను పర్యాటక శాఖ ప్రమోషన్ ఆఫీసర్ సూర్యకిరణ్, హెరిటేజ్ ట్రస్ట్ ప్రొఫెసర్ పాండురంగారావు వారికి వివరించారు. అనంతరం వాలంటీర్లు సౌండ్ అండ్ లైటింగ్ షోను తిలకించారు. వారితో కేంద్ర పురావస్తుశాఖ అధికారి మడిపెల్లి మల్లేశం, ట్రస్ట్ ప్రొఫెసర్ శ్రీధర్‌రావు, శ్రీనివాస్, టీఎస్‌టీడీసీ సౌండ్ అండ్ లైటింగ్ షో ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్ ఉన్నారు.